క్లుప్తంగా

చండూరు తహసీల్దార్‌గా అర్చనారెడ్డి



చండూరు : చండూరు తహసీల్దార్‌గా అర్చనారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన గణేశ్‌ బదిలీపై 15 రోజుల క్రితం వెళ్లగా, డిప్యూటీ తహసీల్దార్‌ వరప్రసాద్‌ ఇన్‌చార్జ్‌ తహసీల్దారుగా విధులు నిర్వర్తించారు. అర్చనారెడ్డి మాడ్గులపల్లి మండలం నుంచి చండూర్‌కు బదిలీపై వచ్చారు.

నేడు పశువుల సంత వేలం

చండూరు : మున్సిపల్‌ పరిధిలోని పశువుల సంత బహిరంగ వేలాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్‌ మొయిజుద్దీన్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంత వేలంకు రెండు దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

కాంగ్రెస్‌ మండల అధ్యక్షుల నియామకం



మునుగోడు : నియామక పత్రం అందుకుంటున్న సురిగి నర్సింహగౌడ్‌

మునుగోడు : కాంగ్రెస్‌ పార్టీ మునుగోడు మండల అధ్యక్షుడిగా మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన సురిగి నర్సింహగౌడ్‌ నియామకమయ్యారు. సోమవారం డీసీసీ అధ్యక్షుడు కె.శంకర్‌ నాయక్‌ నర్సింహగౌడ్‌కు నియామక పత్రం అందజేశారు.



ముద్దం నర్సింహగౌడ్‌ మర్రిగూడ అధ్యక్షుడు

మర్రిగూడ : కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడిగా మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన ముద్దం నర్సింహగౌడ్‌ నియామకమయ్యారు. కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్‌ శంకర్‌నాయక్‌ సోమవారం నర్సింహగౌడ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

దర్వేశిపురం ఆలయం వద్ద వేలం పాట

కనగల్‌ : మండలంలోని దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద 2023–24 ఏడాది కాలానికి గాను వివిధ వస్తువుల విక్రయం, సేకరణ హక్కుల కోసం సోమవారం వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి జల్లేపల్లి జయరామయ్య, ఎండోమెంట్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

శాలిగౌరారం : ఈదురు గాలులకు తెగిపడిన విద్యుత్‌ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన మామిండ్ల శివశంకర వరప్రసాద్‌ తనకున్న రెండు గేదెలను ఇంటివద్ద నుంచి తమ వ్యవసాయ పొలంవద్దకు తోలుకుపోతున్నాడు. ఈ క్రమంలో దారిలో అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్‌ తీగ గేదెల కాళ్లకు తగలడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి.

పరీక్ష ప్యాడ్లు అందజేత

చిట్యాల : వెలిమినేడు జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులకు ఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో సమకూర్చిన పరీక్ష ప్యాడ్లను ఆ గ్రామ సర్పంచ్‌ దేశబోయిన మల్లమ్మపాపయ్య, ఫౌండేషన్‌ చైర్మన్‌ ఏనుగు స్వాతిరఘుమారెడ్డి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్‌ కాటం లింగస్వామి, కాటం సత్తయ్య, అంతటి నర్సింహ, గోలి గణేశ్‌ పాల్గొన్నారు.

చెర్వుగట్టు హుండీ లెక్కింపు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు 41 రోజుల్లో సమర్పించిన కానుకల హుండీలను సోమవారం లెక్కించారు. రూ.34 లక్షల 84 వేల 350 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్‌ తెలిపారు. అన్నదానం హుండీ ఆదాయం రూ.36,298 వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్‌ కె, మహేంద్రకుమార్‌, ఆలయ సూపరింటెండెంట్‌ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా

చిట్యాల : గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ చిట్యాల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం బీజేపీ నాయకులు ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీఓ బి.లాజర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు పాలిమేర రామ్‌కుమార్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లపు బుద్దుడు, చికిలంమెట్ల అశోక్‌, మండల రూరల్‌ అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్‌, గంజి గోవర్ధన్‌, పీకే వెంకన్న, పాపని వాసుదేవ్‌, సిద్దగాని అశోక్‌, పామనగుండ్ల వెంకన్న, శ్రవణ్‌కుమార్‌చారి, నరేంద్రచారి, లింగస్వామి పాల్గొన్నారు.

పంచాయతీ భవనాల్లో సమస్యల తిష్ట



అద్దె భవనంలో బోయగుబ్బ గ్రామపంచాయతీ కార్యాలయం



వనిపాకలలో ఇరుకు భవనంలో పంచాయతీ కార్యాలయం

- చిట్యాల మండలంలో సగానికి పైగా కార్యాలయాలు శిథిలం
- ఇరుకు గదుల్లో నూతన పంచాయతీలు
- ఇబ్బందులు పడుతున్న పాలకవర్గ సభ్యులు, అధికారులు

చిట్యాల : మండలంలోని పలు గ్రామాల పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని భవనాలు ఇరుకుగా ఉండి పంచాయతీ సమావేశాలు, గ్రామసభలు నిర్వహించుకోవడానికి ఇబ్బందిగా ఉన్నాయి. చిట్యాల మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో సగానికి పైగా పంచాయతీ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి.

శిథిలావస్థలో ఉన్న పంచాయతీలు ఇవీ..

మండలంలోని వనిపాకల, వట్టిమర్తి, ఎలికట్టె గ్రామాల పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ పంచాయతీ భవనాల గోడలకు పగుళ్లు వచ్చాయి. నూతన భవనాల నిర్మాణాలకు పంచాయతీ పాలకవర్గాలు పలుమార్లు ప్రతిపాదనలు చేసినా నిధులు మంజూరు కాలేదు.

నూతన జీపీల్లో ఇలా..

నూతనంగా ఏర్పాటైన ఆరెగూడెం, వెంబావి, బోయగుబ్బ, బొంగోనిచెర్వు గ్రామ పంచాయతీ భవనాలు ఒకటి రెండు గదుల్లోనే ఉన్నాయి. వీటిలో బోయగుబ్బ పంచాయతీ భవనం అద్దె భవనంలో నిర్వహిస్తుండగా, ఆరెగూడెం, వెంబాయి, బొంగోనిచెర్వు గ్రామాల్లో గ్రామ అవసరాలకు నిర్మించిన ఒకే గది గల సామాజిక భవనాలను పంచాయతీ కార్యాలయాలుగా ఉపయోగించుకుంటున్నారు. వీటిలో ఆరెగూడెం పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కానీ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

సొంత భవనం నిర్మించాలి



మా బోయగుబ్బ గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం. పంచాయతీ భవనంలో తగిన వసతులు లేక పాలకవర్గ సభ్యులం ఇబ్బందులు పడుతున్నాం. అన్ని వసతులతో కూడిన పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలి.

–కంచర్ల సునిత, సర్పంచ్‌, బోయగుబ్బ

స్టోర్‌ రూమ్‌లు లేక ఇబ్బందులు..

మండలంలోని పలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో స్టోర్‌ రూమ్‌లు లేవు. వీధి దీపాలు, మంచినీటి పైపులైన్లు సామగ్రి ఉంచేందుకు ప్రత్యేక స్టోర్‌ రూమ్‌లు నిర్మించలేదు. దీంతో ఉన్న రెండు గదుల్లోనే వీటిని ఉంచడంతో పంచాయతీ కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా గ్రామ పంచాయతీల్లో కనీసం మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో అధికారులు, పాలకవర్గ సభ్యులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుత గ్రామాల జనాభా అవసరాలకు అనుగుణంగా నూతనంగా విశాలమైన పంచాయతీ భవనాలు నిర్మించాలని, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



నల్లగొండలోని జేబీఎస్‌ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ సుజాత

నల్లగొండ టౌన్‌ : చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడంతోపాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సుజాత అన్నారు. సోమవారం జేబీఎస్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కౌన్సిలర్‌ అభిమన్యుశ్రీనివాస్‌, ఎడ్ల శ్రీనివాస్‌, ధర్మానాయక్‌, కిరణ్‌ పాల్గొన్నారు.

ఫాస్ట్‌ ఫుడ్‌తో అనారోగ్య సమస్యలు

రామగిరి(నల్లగొండ) : ఫాస్ట్‌ ఫుడ్‌ తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని జెడ్పీ ఫ్లోర్‌ లీడర్‌ పాశం రాంరెడ్డి అన్నారు. సోమవారం తిప్పర్తి రైతు వేదికలో జరిగిన పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మార్చి 20వ తేదీ నుంచి ఏప్రిల్‌ 3వ తేదీ వరకు పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషక పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గర్భిణులు, కిశోర బాలికలు పోషక పదార్థాలు తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. గ్రామాల్లో ప్రజలందరికీ పోషక పదార్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఐసీడీఎస్‌ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు, సీడీపీఓ నిర్మల, సూపర్‌ వైజర్‌ సునిత, ఏపీఎం శ్రీదేవి, సర్పంచ్‌ రొట్టెల రమేష్‌లు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చిరకాలం ఆరోగ్యం

మర్రిగూడ : చిరుధాన్యాలతోనే చిరకాలం ఆరోగ్యంగా ఉండడం సాధ్యమవుతుందని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ ముమ్మడి యశోద అన్నారు. సోమవారం మండలంలోని కొండూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్‌ పక్షంలో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం ఉండవచ్చని అన్నారు. సర్పంచ్‌ కుంభం నర్సమ్మ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అక్షిత, అంగన్‌వాడీ టీచర్లు శోభ, రజిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కనగల్‌ : మండల పరిధిలోని బోయినపల్లి గ్రామానికి చెందిన పర్సనబోయిన పద్మ, బాలసాయిగూడెం గ్రామానికి చెందిన తుక్క చంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబాలకు ఆర్‌కేఎస్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ పిల్లి రామరాజు సోమవారం రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్‌ గన్నెబోయిన గంగమ్మచంద్రయ్య, ఎంపీటీసీ యేరెడ్ల సరస్వతిసుధాకర్‌రెడ్డి, నల్లబోలు సురేందర్‌రెడ్డి, సైదిరెడ్డి, సతీష్‌, పురుషోత్తం, బొబ్బల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఈదురు గాలులకు ఎగిరిపోయిన రేకులు

చండూరు : మున్సిపల్‌ పరిధిలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి వెంకన్న అనే వ్యక్తికి చెందిన ఇంటి నాలుగు గదుల రేకులు ఎగిరి పడిపోయాయి. దీంతో తనకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ తహసీల్దార్‌ అర్చనారెడ్డికి వెంకన్న వినతి పత్రం అందించారు.

32 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

శాలిగౌరారం : మండలంలో ఆదివారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా 32 ఎకరాల్లో ఉద్యాన పంటలు, కూరగాయల తోటలు దెబ్బతిన్నట్లు నకిరేకల్‌ క్లస్టర్‌ ఉద్యాన అధికారి రావుల విద్యాసాగర్‌ తెలిపారు. రామాంజాపురం, భైరవునిబండ, ఎన్‌జీ కొత్తపల్లి గ్రామాల్లో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. నిమ్మ 20 ఎకరాలు, మామిడి 5 ఎకరాలు, బొప్పాయి రెండు ఎకరాలు, కూరగాయలు 5 ఎకరాలు దెబ్బతిన్నట్లు తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులు ఆధార్‌ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా బుక్‌ జిరాక్స్‌ కాపీలతోపాటు దెబ్బతిన్న పంటవద్ద దిగిన ఫొటోను జతచేసి మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 7997725347, 8008638639 సెల్‌ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న రైతులు

మర్రిగూడ : అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్నారని ఆరోపిస్తూ బట్లపల్లి గ్రామస్తులు సోమవారం వాహనాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ బట్లపల్లి గ్రామంలో గల సర్వే నంబర్‌ 18లో బొత్తలకుంట చెరువులో ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. కిష్టరాయనిపల్లి రిజర్వాయర్‌ పనులకు ఈ మట్టిని తరలిస్తున్నారని, మట్టిని తొలగించడం వల్ల పల్లె ప్రకృతివనం, సమీప పొలాల రైతులకు దారి ఇబ్బంది కలుగుతుందని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తవ్వకాలను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో నూకల చిన్న అంజయ్య, దుబ్బ లక్ష్మయ్య, రామస్వామి, పెద్ద అంజయ్య, రాములు, ముత్తయ్య, వెంకటయ్య, జగన్‌, వెంకటేష్‌, లక్ష్మయ్య, కృష్ణయ్య, మల్లేష్‌, రాములు పాల్గొన్నారు.

మైసయ్య గౌడ్‌కు నివాళి

చండూరు : గుండగోని మైసయ్యగౌడ్‌ 24వ వర్ధంతిని గట్టుప్పల మండలం తేరట్‌పల్లి గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మైసయ్యగౌడ్‌ విగ్రహానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోమటి వీరేశం పూలమాల వేసి నివాళులర్పించారు. మురళీమనోహర్‌రెడ్డి, పందుల సత్యం, కారింగు సాయికుమార్‌, నామని జగన్నాథం, బ్రహ్మయ్య, మారయ్య, సుధాకర్‌, వెంకటేశం, రాము తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన

మునుగోడు : తడి, పొడి చెత్త నిర్వహణపై సోమవారం మండలంలోని పులిపలుపుల గ్రామంలో గల కంపోస్టు షెడ్డు వద్ద పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ జానయ్య అవగాహన కల్పించారు. చెత్తతో కంపోస్టు ఎరువులను తయారుచేసి గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సుమలత, ఏపీఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ పార్టీతో కలిసి పనిచేస్తాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

చిట్యాల : వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేయనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర సోమవారం రాత్రి చిట్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం రాష్ట్రంలో గతంలో ప్రాతినిథ్యం వహించిన శాసనసభ స్థానాలపై దృష్టి కేంద్రీకరించినట్లు పేర్కొన్నారు. ఆయా స్థానాల్లో పార్టీ నాయకులు పార్టీని బలోపేతం చేయాలన్నారు. రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని కేంద్రం రద్దు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. యాత్రకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడె శ్రవణ్‌కుమార్‌, ఎస్‌ కె.షరీఫ్‌, డీసీసీ నాయకుడు పోకల దేవదాసు, టీడీపీ నాయకుడు శేపూరి సుదర్శన్‌లు సంఘీభావం తెలిపారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నారి అయిలయ్య, వీరారెడ్డి, మల్లు లక్ష్మీ, బండ శ్రీశైలం, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కందాల ప్రమీల, మేక అశోక్‌రెడ్డి, జిట్ట నగేష్‌, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్‌, సరోజ, చిన్నపాక లక్ష్మీనారాయణ, ప్రభావతి, నారబోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల బైక్‌ ర్యాలీ

మునుగోడు : జన చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మునుగోడులో సీపీఎం నాయకులు బైక్‌ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం , జిల్లా కమిటీ సభ్యుడు నాంపల్లి చంద్రమౌళి, చాపల మారయ్య, కర్నాటి మల్లేషం, మండల కార్యదర్శి మిర్యాల భరత్‌కుమార్‌, మునుగోడు సర్పంచ్‌ మిర్యాల వెంకన్న, ఏర్పుల యాదయ్య, జెల్లిపోతుల ధనంజయ్య, సాగర్ల మల్లేష్‌, శ్రీను, ముత్యాలు, నారగోని నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

యాత్రకు స్వాగతం పలికిన నాయకులు

నార్కట్‌పల్లి : మండలంలోని ఏపీ లింగోటం గ్రామ శివారుకు తమ్మినేని వీరభద్రం, చెరుపల్లి సీతారాములు బృందం చేరుకోగానే నార్కట్‌పల్లి నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కమిటీ సభ్యుడు శ్రీ రామోజి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, వైస్‌ ఎంపీపీ కల్లూరి యాదగిరి, బయన్న, శ్రవణ్‌కుమార్‌, అర్ధం శ్రీను, ఐలయ్య, రవిశంకర్‌, శంకర్‌రెడ్డి, భిక్షం పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



గట్టుప్పల మండల కేంద్రంలో ఎల్లమ్మ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



మునుగోడు : ప్రత్యేక పూజలు చేస్తున్న వేమిరెడ్డి నర్సింహారెడ్డి దంపతులు

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మాడ కృష్ణమూర్తి, మాడ పాపయ్య ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన, హోమం, యాగం అత్యంత వైభవంగా జరిగింది. బీఆర్‌ఎస్‌ మండల కన్వీనర్‌ ఇడెం కైలాసం దంపతులు, సర్పంచు ఇడెం రోజా, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : మండలంలోని చల్మెడ గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో సోమవారం ఎల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాత, హైదరాబాద్‌ రాజధాని బ్యాంక్‌ చైర్మన్‌ వేమిరెడ్డి నర్సింహారెడ్డి దంపతులు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ కర్నాటి మహేశ్వరి, వేమిరెడ్డి జితేందర్‌ రెడ్డి, పగిళ్ల శ్రీరాములతో పాటు గ్రామస్తులు వేడుకల్లో పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కనగల్‌ : మండల పరిధిలోని బోయినపల్లి గ్రామంలో సోమవారం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ఆలయానికి రూ.1,50,000 నగదు విరాళంగా అందజేశారు. ఆర్‌కేఎస్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ పిల్లి రామరాజు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్‌, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్‌లు హాజరై ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ వంగాల సహదేవరెడ్డి, మాజీ చైర్మన్‌ నల్లబోతు యాదగిరి, స్థానిక సర్పంచ్‌ పగిళ్ల యాదయ్య, ఉప సర్పంచ్‌ భిక్షాల సైదమ్మసునిత తదితరులు పాల్గొన్నారు.



కనగల్‌ : విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

దేశానికే తెలంగాణ పథకాలు ఆదర్శం



బీఆర్‌ఎస్‌ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

కనగల్‌ : సీఎం కేసీఆర్‌ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని జి యడవల్లి గ్రామంలో నిర్వహించిన బీఆర్‌ఎస్‌ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలే తన బలం, బలగం అన్నారు. గత పాలకుల అలసత్వంతో నల్లగొండ నియోజకవర్గం వెనుకబాటుకు గురయిందన్నారు. తాను వచ్చాకే ప్రతి ఊరిలో అభివృద్ధి జరిగిందన్నారు. అదేవిధంగా పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను అందజేశారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. ముందుగా వారికి కోలాటం మహిళల బృందం స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ మందడి సైదిరెడ్డి, ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్‌, వైస్‌ ఎంపీపీ రామగిరి శ్రీధర్‌రావు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పూజలు

దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభానికి దాతల సహకారంతో ఇత్తిడి తొడుగులు వేయించారు. సోమవారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ వంగాల సహదేవరెడ్డి, మాజీ చైర్మన్‌ నల్లబోతు యాదగిరి, అల్లుబెల్లి నర్సింహారెడ్డి, రామచంద్రు, చనగాని యాదగిరిగౌడ్‌ ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కంచర్ల ఆర్థిక సాయం

మండల పరిధిలోని బోయినపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యకర్త పర్సనబోయిన వెంకన్న భార్య పద్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి రూ.20 వేల నగదును అందజేశారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్‌ పగిళ్ల యాదగిరి, ఉప సర్పంచ్‌ భిక్షాల సైదమ్మశ్రీను ఉన్నారు.

నకిరేకల్‌ను మోడల్‌ పట్టణంగా మారుస్తా

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నకిరేకల్‌ : విద్యుత్‌ స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్‌ : నకిరేకల్‌ను అభివృద్ధిలో మోడల్‌ పట్టణంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా నకిరేకల్‌ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌ స్తంభాలు, డ్రెయినేజీ పనులను సోమవారం ఉదయం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నకిరేకల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. పట్టణ ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం పట్టణానికి చెందిన గందమల్ల సత్తయ్యకు మంజూరైన రూ.53 వేల సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కు అందజేశారు. ఆయన వెంట మున్సిపల్‌ చైర్మన్‌ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్‌, వార్డు కౌన్సిలర్‌ రాచకొండ సునీల్‌, మాద నగేష్‌ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌ బలోపేతానికి సమష్టిగా కృషిచేయాలి

కట్టంగూర్‌ : బీఆర్‌ఎస్‌ బలోపేతానికి ప్రతిఒక్కరూ సమష్టిగా కృషిచేయాలని నకిరేకల్‌ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 31న కట్టంగూర్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్‌ పార్టీ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కమిటీలు వేసి పార్టీ అభివృద్ధికి ఐక్యంగా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు ఊట్కూరు ఏడుకొండలు, మున్సిపల్‌ చైర్మన్‌ రాచకొండ శ్రీనివాస్‌, మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ పోగుల నర్సింహ, మండల ప్రధాన కార్యదర్శి వడ్డె సైదిరెడ్డి, ఎంపీటీసీ పాలడుగు హరికృష్ణ, తడిడబోయి భవాని, గాజుల బుచ్చమ్మ, గుండగోని రాములు, జహంగీర్‌, ముప్పిడి యాదయ్య, చిట్యాల రాజిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

టీఎస్‌పీఎస్సీ కమిటీని రద్దు చేయాలి

నల్లగొండ టౌన్‌ : నిరుద్యోగుల జీవితాలను ఆగం చేసిన టీఎస్‌పీఎస్సీ కమిటీని వెంటనే రద్దు చేయాలని మాలమహానాడు జాతీయ స్టీరింగ్‌ కమిటీ సభ్యుడు గోలి సైదులు, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌ పంబాల అనిల్‌కుమార్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం బహుజన సమాజ్‌ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట నిర్వహించిన నిరసన దీక్షలో వారు మాట్లాడారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. ఆదిమల్ల గోవర్ధన్‌, బీఎమ్‌ప్రసాద్‌, కత్తుల కన్షీరాం, వంటెపాక యాదగిరి, పల్లేటి రవీందర్‌, గ్యార మారయ్య, అంకెపాక శ్రీనివాస్‌, దున్న లింగస్వామి, చాంద్‌పాషా, పెరిక అభిలాష్‌, రాంప్రసాద్‌, వినోద్‌చారి పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌ మిషన్‌పై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీఆర్‌ఎస్‌ పార్టీ జెడ్పీ ఫ్లోర్‌ లీడర్‌ పాశం రాంరెడ్డి

రామగిరి(నల్లగొండ) : బీఆర్‌ఎస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామాల్లో పారిశుద్ధ్య వసరులు మెరుగుపడ్డాయని జెడ్పీ ఫ్లోర్‌ లీడర్‌ పాశం రాంరెడ్డి అన్నారు. సోమవారం తిప్పర్తి ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ భారత్‌ మిషన్‌ ఫేజ్‌–2 శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ట్రాక్టర్‌ అందజేశామని, డంపింగ్‌ యార్డులు నిర్మించామని తెలిపారు. శిక్షణ అధికారి శంకర్‌బాబు మాట్లాడుతూ మూడు రోజులపాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లకు, పంచాయతీ సెక్రటరీలకు గ్రామ పారిశుద్ధ్య ప్రణాళిక రూపకల్పనపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. మరుగుదొడ్ల వినియోగం, తడి, పొడి చెత్త వేరుచేయడం, ప్లాస్టిక్‌ నిర్మూలనపై అవగాహన కల్పించనున్నామన్నారు. ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్‌ రొట్టెల రమేష్‌, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

విరాళం అందజేత



ఎంజీయూ వీసీకి చెక్కు అందజేస్తున్న డాన్‌బాస్కో సొసైటీ ప్రతినిధులు

నల్లగొండ రూరల్‌ : మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం టాపర్లకు గోల్డ్‌ మెడల్స్‌ అందజేసేందుకు డాన్‌బాస్కో అకాడమీ వ్యవస్థాపకుడు గోపు ఆనందరెడ్డి జ్ఞాపకార్థం సేలిసియన్స్‌ ఆఫ్‌ డాన్‌బాస్కో సొసైటీ ప్రతినిధులు ఏలియా, వెంకన్న సోమవారం రూ.10 లక్షల విలువ గల చెక్కును యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్‌లకు అందజేశారు. ఎంఏ ఇంగ్లిష్‌, ఎంఏ ఎకనామిక్స్‌, సోషల్‌ వర్క్‌, ఎమ్మెస్సీ ఆర్గానిక్‌ కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో కాలేజీ టాపర్లకు గోల్డ్‌ మెడల్స్‌ అందించనున్నారు. ఈ సందర్భంగా డాన్‌బాస్కో సంస్థ వారికి, కరస్పాండెంట్‌ ఫాదర్‌ బాలశౌ రెడ్డికి వీసీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ ఆచార్య కృష్ణారావు, ఓఎస్‌డీ ఆచార్య అల్వాల రవి, ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె అరుణప్రియ, ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కొప్పుల అంజిరెడ్డి, కెమిస్ట్రీ విభాగ అధిపతి డాక్టర్‌ దోమల రమేష్‌, డాక్టర్‌ చింతా శ్యాంసుందర్‌, డాక్టర్‌ నవీన్‌కుమార్‌, డాక్టర్‌ ప్రశాంతి పాల్గొన్నారు.

'రైట్‌ టు హెల్త్‌ చట్టాన్ని రద్దు చేయాలి'

నల్లగొండ టౌన్‌ : రాజస్థాన్‌ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైట్‌ టు హెల్త్‌ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఐఎంఏ కార్యదర్శి డాక్టర్‌ గౌరిశ్రీ డిమాండ్‌ చేశారు. సోమవారం స్థానిక ఐఎంఏ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందించాలని చట్టంలో పేర్కొనడం వల్ల వైద్యులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్‌ పుల్లారావు మాట్లాడుతూ వైద్యుల మనోభావాలు దెబ్బతీసే చర్యలకు ప్రభుత్వాలు పాల్పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ అనితారాణి, డాక్టర్‌ రాజేశ్వరి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కట్టంగూర్‌ : రాహుల్‌గాంధీ పార్లమెంట్‌ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం మండలకేంద్రంలో కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు దైద రవీందర్‌ మాట్లాడుతూ లోక్‌సభలో అదానీ గురించి పదేపదే నిలదీస్తున్నారనే అక్కసుతో రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని విమర్శించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌ సభ్యత్వాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్యగౌడ్‌, రెడ్డిపల్లి సాగర్‌, మాద లింగస్వామి, వల్లపు శ్రీనివాసరెడ్డి, చెరుకు యాదగిరి, గద్దపాటి రాములు, చింత వెంకటనర్సయ్య, అమరోజు నర్సింహ, కొంపెల్లి యాదయ్య, రెడ్డిపల్లి వీరస్వామి, గోపి, శ్రీకాంత్‌, శ్రీను, సైదులు, వెంకటనారాయణ ఉన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు